సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

‘స్పెషల్’ సేవలకు దూరం

- గతంలో ఇంటి వద్దకే వైద్యులను పంపించిన సీఎం జగన్
- ఐదేళ్లూ ప్రజలకు అందుబాటులో వైద్య నిపుణుల సేవలు
- కూటమి ప్రభుత్వం రాగానే ప్రత్యేక వైద్యుల సేవల నిలిపివేత
- దిక్కులేక కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న రోగులు



గత ప్రభుత్వంలో దాకమర్రి వైద్య శిబిరంలో సేవలు అందిస్తున్న వైద్య నిపుణులు



సీఎం జగన్ పాలనలో ఎండాడలో రూ.1.8 కోట్లతో నిర్మించిన వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

తగరపువలస : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కొనసాగిన ప్రత్యేక వైద్యుల సేవలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక వైద్యులను వెనక్కు పంపి రాష్ట్ర ప్రజలు కార్పొరేట్ ఆస్పత్రుల బాట పట్టేలా చేసి జేబులను గుల్ల చేస్తోంది. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి అధిక ప్రాధాన్యమిచ్చిన విషయం అందరికీ తెలిసిందే. 2019లో ఆయన అధికారం చేపట్టక ముందు నియోజకవర్గంలో ఒక కమ్యూనిటీ హెల్త్ సెంటర్, మండలానికో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మాత్రమే ఉండేవి. ప్రతి పంచాయతీలో కనీస వసతులు, మందులు లేకుండా ఆరోగ్య ఉప కేంద్రాలు ఉండేవి. 2019 నుంచి 2024 వరకు సీఎం జగన్ కార్పొరేట్ ఆస్పత్రులను తలదన్నేలా గ్రామీణ ప్రజలకు ఖరీదైన వైద్య సదుపాయాలు అందించారు. ప్రతీ పీహెచ్‌సీ పరిధిలో 104 వాహనం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిధిలో 108 వాహనాలను అందుబాటులో ఉంచారు. సీహెచ్‌సీ, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు చికిత్స, వాక్సిన్లు అందించేవారు. ప్రసవాలు, సిజేరియన్ చేయించుకునే వారిని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఆస్పత్రి నుంచి ఇంటికి నేరుగా తరలించేవారు. ఫ్యామిలీ ఫిజీషియన్ పేరుతో గ్రామీణ ప్రజలకు నెలలో రెండు సార్లు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రతి సచివాలయ పరిధిలో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించి మందులు ఉచితంగా అందించేవారు. అవసరమైన వారికి రిఫరల్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యం ఉచితంగా అందించారు. రూ.5 లక్షల పరిమితి ఉండే ఆరోగ్యశ్రీ వైద్యాన్ని రూ.25 లక్షలకు పెంచారు.


ప్రైవేటు ఆస్పత్రులే దిక్కు

కొమ్మాది: ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ, మిథిలాపురి వూడా కాలనీ, జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడలో వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఒక్కొక్కటి రూ.1.80 కోట్లతో నిర్మించారు. ప్రతీ యూపీహెచ్‌సీలో ఒక హెల్త్ ఆఫీసర్, ఇద్దరు నర్సింగ్ సిబ్బంది, ఒక సూపర్‌వైజర్, ఒక ల్యాబ్ టెక్నీషియన్, కంప్యూటర్ ఆపరేటర్, ఒక శానిటరీ వర్కర్‌ను నియమించారు. వారంలో 8 మంది స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. దీంతో ఏ ఆరోగ్య సమస్య వచ్చినా స్థానికులు యూపీహెచ్‌సీలను ఆశ్రయించి ఉచితంగా వైద్యం చేయించుకునేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్పెషలిస్టు వైద్యుల సేవలు నిలిపివేయడంతో రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఎండాడ, చేపలుప్పాడ, మిథిలాపురి వూడా కాలనీ యూపీహెచ్‌సీలలో రోజుకు 100 నుంచి 150 మంది ఓపీకి వచ్చేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 30కి పడిపోయిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

గత ప్రభుత్వంలో వైద్యానికి అధిక ప్రాధాన్యం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పర్యవేక్షణలో భీమిలి నియోజకవర్గంలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు వారంలో రెండు రోజులు ప్రత్యేక వైద్య నిపుణులు వచ్చేవారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వీరి సేవలను ప్రజలు వినియోగించుకునేవారు. ప్రత్యేక సేవలలో పీడియాట్రిక్స్, డెర్మటాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్, ఈఎన్‌టీ, జీరియాట్రిక్, ఫల్మనాలజీ, ఓబీజీ అండ్ గైనకాలజీ, జనరల్ మెడిసిన్ వైద్యులు అందుబాటులో ఉండేవారు. అలాగే గత ప్రభుత్వం పలు ఆస్పత్రులు కొత్తగా నిర్మించడంతోపాటు, పాత వాటికి మరమ్మతులు చేపట్టి ఆధునికీకరించింది. ఆ వివరాలు ఇలా వున్నాయి.

- రూ.8.21 కోట్లతో ఎనిమిది పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (చేపలుప్పాడ, కొమ్మాది, పీఎం పాలెం, స్వతంత్రనగర్, వాంబే కాలనీ, మారికవలస, రుషికొండ, మిథిలాపురి వుడా కాలనీ) నిర్మించారు.



వాంబేకాలనీ యూపీహెచ్‌సీలో స్పెషలిస్ట్ వైద్యుల వివరాలు లేని చార్ట్

- 3 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (తగరపువలస, భీమిలి, సాగర్‌నగర్) రూ.30 లక్షలతో ఆధునికీకరించారు.
- 4 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను (తాళ్లవలస, రేవిడి, మధురవాడ, ఆనందపురం) రూ.2.68 కోట్లతో ఆధునికీకరించారు.
- భీమిలి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను రూ.3.60 కోట్లతో ఆధునికీకరించారు.
- 36 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించారు.

వైద్యుల సేవలు కొనసాగించాలి



గత ప్రభుత్వం మాదిరిగా ఇప్పటి కూటమి ప్రభుత్వం కూడా ప్రత్యేక వైద్యుల సేవలు కొనసాగించాలి. ఏ ప్రభుత్వమైనా విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలి. ఈ విషయంలో గత సీఎం జగన్ నిర్ణయాలతో ప్రజలకు ఎంతో మేలు జరిగింది.

– కాళ్ల గౌరి, ఆనందపురం

ఖరీదైన వైద్యం కొనుక్కోలేం



ఖరీదైన వైద్యం సామాన్య ప్రజలు కొనుక్కోలేరు. అందువల్ల కూటమి ప్రభుత్వం ప్రత్యేక వైద్యుల సేవలు కొనసాగించాలి. సామాన్యుడు కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్తే పరీక్షలు, చికిత్స, మందులు, ఐసీయూ పేరుతో దోచుకుంటున్నారు.

– తెడ్లాపు అప్పలరాజు, తగరపువలస

స్పెషలిస్టుల సేవలు అవసరం



నాకు నరాలు, చేతుల నొప్పులు, ఇతరు ఇబ్బందులు ఉన్నాయి. మాత్ర వేసుకుంటేనే నొప్పులు తగ్గుతున్నాయి. లేకపోతే ఇబ్బంది భరించలేకపోతున్నా. యూపీహెచ్‌సీకి వస్తే సరైన వైద్యం అందుబాటులో లేదు. ఈ ప్రభుత్వం స్పెషలిస్ట్ డాక్టర్లను కొనసాగించి వుంటే నేను కేజీహెచ్ లేదా విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదు.

– వి.రామలక్ష్మి, వాంబే కాలనీ



స్పెషలిస్ట్ వైద్యులు లేకపోవడంతో వెలవెలబోతున్న వాంబేకాలనీ యూపీహెచ్‌సీ

తీవ్ర నొప్పితో బాధపడుతున్నా

నేను కొద్ది రోజుల నుంచి తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నా. వైద్యం కోసం చేపలుప్పాడలో గల యూపీహెచ్‌సీకి వెళ్తే తాత్కాలికంగా నొప్పి తగ్గడానికి మందులు ఇవ్వగలమని, శాశ్వత పరిష్కారం కోసం స్పెషలిస్టు వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఇక్కడ స్పెషలిస్ట్ వైద్యులు లేకపోవడంతో, వర్షంతో నగరానికి వెళ్లలేక నొప్పితో బాధపడుతున్నా. – డి.ఎల్లాజీ ఉప్పాడ

స్పెషలిస్టు వైద్యులను నియమించాల్సిందే

పెద్ద అనారోగ్య సమస్యలు వస్తే విశాఖ నగరంలోని ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. గైనిక్ సమస్యతో యూపీహెచ్‌సీకి వస్తే స్పెషలిస్టు వైద్యులను తీసేశారని సిబ్బంది తెలిపారు. దీంతో కేజీహెచ్‌కు వెళ్లాల్సి వచ్చింది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త సమస్యలు సృష్టిస్తున్నారు. తీర ప్రాంతంలోని ఈ యూపీహెచ్‌సీకి స్పెషలిస్టు వైద్యులను నియమించాలి.

– ఎస్.సత్య, జేవీ అగ్రహారం

ఆరు యూపీహెచ్‌సీలలో అవస్థలు

మధురవాడ: జీవీఎంసీ 5, 6, 7 వార్డుల్లో సుమారు లక్షన్నర జనాభాకి ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారానే వైద్య సేవలు అందేవి. ఇవి చాలా దూరాభారం కావడంతో ప్రజలు ప్రైవేటు వైద్యులనే ఆశ్రయించాల్సి వచ్చేది. గత ప్రభుత్వం మారికవలస, స్వతంత్రనగర్, కొమ్మాది, పీఎంపాలెం, మిథిలాపురి ఉడా కాలనీ, వాంబేకాలనీలో ఆరు యూపీహెచ్‌సీలు ఏర్పాటు చేయడంతో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. జనరల్ ఫిజీషియన్, చిన్న పిల్లలు, మహిళల వ్యాధులు, కంటి, ఎముకలు తదితర వైద్య నిపుణులతో సేవలు అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిపుణుల సేవలు రద్దు చేయడంతో ఆస్పత్రుల్లో ఓపీ కూడా తగ్గిపోయింది. ఈ విషయం అక్కడి రికార్డుల చూస్తే తెలిసిపోతోంది.

వైద్య నిపుణులతో ప్రయోజనం



సీఎం జగన్ ప్రభుత్వంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య నిపుణుల వల్ల అందరికీ ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లకుండా ఇక్కడే మెరుగైన సేవలు పొందేవారు. కూటమి ప్రభుత్వం స్పెషలిస్ట్ వైద్యుల సేవలు జూలై 1 నుంచి నిలిపివేయడంతో ఇబ్బందిగా వుంది.

– రాంభుక్త దేవి, భీమిలి

మళ్లీ అవకాశం కల్పించాలి



గత ప్రభుత్వంలో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉండడంతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్పెషలిస్ట్ వైద్యుల సేవలు నిలిపివేయడంతో పేద రోగులు ఇబ్బంది పడుతున్నారు. ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని మెరుగైన వైద్య సేవలు అందించాలి.

– పట్ట శ్రీరాములు, భీమిలి

గత ప్రభుత్వంలానే సేవలందించాలి



రేవిడి పీహెచ్‌సీలో వైద్య నిపుణులతో సంబంధిత సేవలందించాలి. ప్రత్యేక వైద్య నిపుణులు లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. పేదలు ప్రైవేటు వైద్య నిపుణులతో వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక స్థోమత లేక అప్పులపాలవుతున్నారు. గత ప్రభుత్వంలానే వైద్య సేవలు అందించాలి.

– కె.రమేష్, పాండ్రంగి

మెరుగైన వైద్యం అందించాలి



ముడుకు నొప్పితో బాధపడుతున్నా. రేవిడి పీహెచ్‌సీలో ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు ఉంటారని వచ్చాను. తీరా వచ్చిన తర్వాత వైద్యులు లేరు. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లేందుకు ఆర్థిక స్థోమత లేదు. దీనివల్ల పీహెచ్‌సీకి రావడం తప్పడం లేదు. నిపుణులైన వైద్యులతో మెరుగైన వైద్య సేవలు అందించాలి.

– బి.పాపునాయుడు, బొత్సపేట

క్లుప్తంగా

ఐదుగురికి డయేరియా



జగన్నాథపురంలో స్థానికులను విచారిస్తున్న వైద్య సిబ్బంది

తగరపువలస : ఆనందపురం మండలం చందక పంచాయతీ జగన్నాథపురంలో డయేరియా బారినపడిన ఐదుగురు వ్యక్తులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో పాండ్రంగి సూరిరాములు, పాండ్రంగి నీలిమ, మతికాన జట్లనాయుడు, మతికాన నారాయణస్వామి, బూర్లె సాయిలక్ష్మి ఉన్నారు. గురువారం వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించి డయేరియా ప్రబలడానికి గల కారణాలను విశ్లేషించారు. మంగళవారం చేపలు కొనుగోలు చేసి తిన్న కొందరికి బుధవారం నుంచి డయేరియా సోకినట్టు స్థానికులు తెలియజేశారు. ఇదిలా ఉండగా ఆనందపురం పీహెచ్‌సీ సిబ్బంది గురువారం ఇంటింటికీ క్లోరిన్ మాత్రలు పంపిణీ చేసి, వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు.

సభ్యత్వ నమోదు ప్రారంభం

కొమ్మాది : బూత్ స్థాయి నుంచి జనసేన పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ అన్నారు. గురువారం ఎండాడలో గల పార్టీ కార్యాలయంలో 4వ విడత క్రియాశీల సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. ప్రతి కార్యకర్త సభ్యత్వ నమోదులో ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు సాకరి శ్రీనివాస్, నాగోతి నర్సింగనాయుడు, శ్రీకాంత్, పిల్లా బాలు, ఉమ్మిడి రాజు పాల్గొన్నారు.

జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు మండేలా



విద్యార్థులకు వివరిస్తున్న అప్పలరాజు

తగరపువలస : శాంతి, స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాడుతూ జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు నెల్సన్ మండేలా అని జీవీఎంసీ ఒకటో వార్డు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. గురువారం నెల్సన్ మండేలా అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా ఆయన జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. 20వ శతాబ్దాన్ని మార్చిన వ్యక్తి మండేలా అని కొనియాడారు. ఆయన సాధించిన విజయాలు స్మరించుకోవడమే కాకుండా సమాజంలో మార్పు కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి పాల్గొన్నారు.

బియ్యం, పప్పు విక్రయాలు ప్రారంభం

తగరపువలస : ఆనందపురం మండలం వేములవలస పువ్వుల మార్కెట్ సమీపంలో మండల ప్రజల కోసం తక్కువ ధరలకు ప్రభుత్వం విక్రయించే బియ్యం, కందిపప్పు అమ్మకాలను గురువారం జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి జి.సూర్యప్రకాశరావు, స్థానిక తహసీల్దార్ జి.హేమంత్ ప్రారంభించారు. సూర్య ట్రేడర్స్ వద్ద ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం కంది పప్పు కిలో రూ.160, బీపీటీ స్టీమ్డ్ సోనామసూరి బియ్యం కిలో రూ.49లకు ప్రత్యేక కౌంటర్ ద్వారా విక్రయిస్తున్నట్టు తెలిపారు.

పద్మనాభం : జిల్లాలోని 172 కేంద్రాల్లో తక్కువ ధరకు నాణ్యమైన బియ్యం, కంది పప్పు అమ్ముతున్నట్టు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జి.సూర్య ప్రకాశరావు తెలిపారు. పద్మనాభంలోని మహిళా మార్టులో గురువారం తక్కువ ధరకు దేశీవాళీ కంది పప్పు, సోనామసూరి బియ్యం అమ్మే ప్రక్రియను ఆయన ప్రారంభించారు. స్పెన్సర్, మోర్, రైతు బజార్లు, మహిళా మార్టుల్లో ఈ వస్తువులను అమ్ముతున్నామన్నారు. హెచ్‌టీడీ యోగి, సీఎస్‌డీటీ చైతన్య, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు బుగత రమేష్, మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు ఎ.సత్యనారాయణ, కాళ్ల సత్యనారాయణ, కంటుబోతు ఎర్నాయుడు పాల్గొన్నారు.



వేములవలసలో విక్రయాలు ప్రారంభిస్తున్న డీఎస్‌వో సూర్యప్రకాష్, తహసీల్దార్ హేమంత్

ఆటలతో సంపూర్ణ ఆరోగ్యం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఇన్‌చార్జి కమాండెంట్ పద్మనాభరాజు

పీఎం పాలెం : మానసిక, శారీరక ఆరోగ్యానికి ఆటలు ఎంతగానో దోహదపడతాయని బక్కన్నపాలెం ఏపీఎస్‌పీఎఫ్ 16వ బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ పద్మనాభరాజు అన్నారు. బెటాలియన్ పరిధిలో ఇటీవల అభివృద్ధి చేసిన మైదానాలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ కేంద్రంలో వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ మైదానం అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అనంతరం నగరంలోని మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజశేఖర్, ప్రముఖ వైద్యులు కృష్ణ మహంతి, ప్రియాంక పాల్గొన్నారు.

ఎర్రమట్టి తరలింపుపై దర్యాప్తు జరపాలి

భీమునిపట్నం: ఎర్రమట్టి దిబ్బల ఆక్రమణ, అక్కడ అక్రమ తవ్వకాలపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో సమగ్ర దర్యాప్తు జరపాలని జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్‌లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సీపీఎం భీమిలి కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి డిమాండ్ చేశారు. గురువారం వారు ఎర్రమట్టి దిబ్బల్లో తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఇక్కడి భూములను ఏ ప్రాతిపదికపై కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి కేటాయించారన్న వివరాలు సరిగ్గా లేవని తెలిపారు. హెరిటేజ్ ప్రాంతంగా వున్న ఇక్కడ కేటాయింపులు జరిగిన తీరు, నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలపై, రాజకీయ నాయకుల ప్రమేయంపై దర్యాప్తు జరపాలని కోరారు. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ఎర్రమట్టి దిబ్బలను పరిరక్షించాలని కోరారు.



ఎర్రమట్టి దిబ్బలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు గంగారావు, ఆర్ఎస్ఎన్ మూర్తి

హాస్టల్స్‌లో పరిశుభ్రత లోపిస్తే చర్యలు

మధురవాడ : ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో పరిశుభ్రత, నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు హెచ్చరించారు. గురువారం మధ్యాహ్నం మధురవాడ సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతి గృహం, కళాశాల బాలుర వసతి గృహం – 1లను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. కళాశాల బాలుర వసతి గృహంలో విద్యార్థులుండే గదుల్లోనే దుస్తులు ఆరబెట్టడం, అపరిశుభ్ర వాతావరణాన్ని పరిశీలించి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పక్కనే ఉన్న సమీకృత వసతి గృహం కూడా పరిశీలించారు. వార్డెన్ నిత్యం అప్రమత్తంగా వుంటూ, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ఈ హాస్టల్స్ పరిసరాలు, వీటికి చెందిన భూమిలో ప్రైవేటు బడ్డీలు ఉండడాన్ని చూసి తొలగించాలని వార్డెన్లను ఆదేశించారు. బడ్డీలు తొలగించే విషయంలో ఇబ్బందులుంటే తమ తెలియజేస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు.



మధురవాడ కళాశాల బాలుర వసతి గృహంలో వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీడీ రామారావు

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
S.O.P. 15/2024

Between:
1) Smt. Behara Padmavathi, W/o. Behara Venkata Ramana Murthy (Late)
2) Behara Jyothi Kumar, S/o. Behara Venkata Ramana Murthy (Late)
3) Behara Ajay Kumar, S/o. Behara Venkata Ramana Murthy (Late)
...Petitioners
And
Sub Post Master, Muvvalavanipalem S.O, Visakhapatanam-530017
...Respondent

GENERAL NOTICE

The public in general are hereby informed that the above named petitioners filed the above petition to issue Succession Certificate in their favour enabling them to transfer the schedule mentioned three Term deposits in the Sub Post Master, Muvvalavanipalem S.O, Visakhapatanam-530017 in their names, which stands in the name of the deceased Behara Venkata Ramana Murthy, S/o late Prakash Rao who died on 12-12-2023. The above matter stands posted to 01-08-2024. Therefore the public in general are hereby informed that if anyone having objections in the above matter, please appear before the Hon'ble Court on 01-08-2024 at 10:30 A.M., and intimate the objections, failing which the matter will be decided exparte in your absence as per law.

B.N. RAO, H.S. ALI, B. KAVITHA, P. HYMA & G. SYAMALA DEVI
Advocates,
Visakhapatnam, Cell: 9885355102

హెల్మెట్‌తో విలువైన ప్రాణాలకు రక్షణ

మధురవాడ : ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరిస్తే విలువైన ప్రాణాలకు రక్షణగా నిలుస్తుందని సీనియర్ సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎం.వెంకట శేషమ్మ అన్నారు. మధురవాడ గాయత్రి ఇంజినీరింగ్ కళాశాల, గాయత్రి మహిళా ఇంజినీరింగ్ కళాశాలతోపాటు చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెల్మెట్ ధారణ – రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు, చట్టాలు తెలుసుకోవడంతోపాటు విధిగా పాటించాలన్నారు. డీఎల్ఎస్ ప్యానల్ మెంబర్లు సీహెచ్ స్వర్ణ గౌరీమణి, రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించడం వల్ల అందరికీ మేలు జరుగుతుందన్నారు. డాక్టర్ ఆర్‌కే గో స్వామి, ఎస్‌వీఎస్ సోమయాజులు పాల్గొన్నారు.



చంద్రంపాలెం హైస్కూల్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి వెంకట శేషమ్మ

తీరం అల్లకల్లోలం

- రుషికొండలో నిలిచిన బోటు షికారు

కొమ్మాది: బంగాళాఖాతంలో అల్ప పీడనం కారణంగా సాగర్‌నగర్, రుషికొండ, మంగమారిపేట, ఉప్పాడ, భీమిలి సముద్ర తీరం గురువారం సాయంత్రం అల్లకల్లోలంగా మారింది. సముద్ర కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడటంతో పాటు బలంగా గాలులు వీయడంతో మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. తమ విలువైన బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వాతావరణంలో మార్పులతో రెండు రోజుల పాటు వేటకు విరామం చెప్పినట్లు మత్స్యకారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. రుషికొండ బీచ్‌లో బోటు షికారును నిలిపివేశారు. సముద్రంలో పెద్ద ఎత్తున అలలు ఎగసి పడటంతో బోటు షికారు నిలిపివేశామని, పర్యాటకులు గమనించాలని నిర్వాహకులు సూచించారు. బోట్లను తీరంలో భద్రపరిచారు.



అల్లకల్లోలంగా మారిన తీరం



తీరం వద్ద నిలిపిన బోట్లు

గిరి ప్రదక్షిణకు పక్కాగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న జెడ్సీ శైలజావల్లి

మధురవాడ : గిరి ప్రదక్షిణకు ఉన్నతాధికారులు నిర్దేశించిన విధంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని జీవీఎంసీ జోన్ – 2 కమిషనర్ శైలజావల్లి చెప్పారు. గురువారం మధురవాడ జోనల్ కార్యాలయంలో ఆమె వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి, సూచనలు చేశారు. జోన్ పరిధిలోని శ్రీకృష్ణాపురం పరిసర ప్రాంతాల నుంచి తెన్నేటి పార్కు వరకు గల రోడ్డుపై అవసరమైనచోట మరమ్మతులు చేపట్టాలని, రోడ్డు పక్కన్న ఉన్న ఆక్రమణలు వెంటనే తొలగించాలని ఆదేశించారు. 32 చోట్ల తాగునీటి స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి విభాగం అధికారి, సిబ్బంది కేటాయించిన పనులు నిర్లక్ష్యం లేకుండా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి కిషోర్, సూపరింటెండెంట్ అప్పలరాజు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

పద్మనాభం : వర్షాలు కురుస్తున్నందున డయేరియా, జ్వరాలు ప్రబలే ప్రమాదముందని, గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.వి.ఎ.శ్రీనివాసరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో పారిశుధ్యంపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రక్షిత మంచి నీటి పథకాల ట్యాంకులను శుభ్రపరచాలని సూచించారు. తాగునీటిని క్లోరినేషన్ చేసి ప్రజలకు సరఫరా చేయాలని తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా మురుగు నీటి కాలవలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు.



పద్మనాభంలో వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు

ఈ సందర్భంగా ఆయన పద్మనాభం, మద్ది, రేవిడి, పాండ్రంగి గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య, రక్షిత మంచి నీటి పథకాల క్లీనింగ్ పనులను పరిశీలించారు. ఆయన వెంట ఈవోఆర్డీ కుమార్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం నేడు

తగరపువలస : భీమిలి మండలం టి.నగరపాలెం గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ఉదయం 9.30 నుంచి ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించిన వైద్యులు తనిఖీల అనంతరం మందులు ఉచితంగా ఇవ్వనున్నారు. ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి ఒక ప్రకటనలో తెలిపారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
భీమిలి
9493185214